ప్రజాశక్తి

సోమవారం 6 ఫిబ్రవరి 2023



తుది దశకు కిమ్మి వంతెన పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం - వంగర మండలాల్లో కిమ్మి- రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై చేపడుతున్న వంతెన పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. 12, 13 పి పిఆర్‌ల మధ్య ఆదివారం స్లాబ్ పనులు చేపట్టడంతో దాదాపు వంతెన పనులు పూర్తి అయినట్లే. రూ.27 కోట్లతో చేపడుతున్న వంతెన పనులు 2012లో ప్రారంభించారు. వంతెన పనులు కావస్తుండడంతో ఆయా నదీతీర గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వంతెనపై శ్లాబ్‌కు ఏర్పాటు చేసిన ఐరన్



పూత ఆశాజనకం.. కాపు కలిసొచ్చేనా?

- జీడిపై గిరిజనుల ఆశలు
- గిట్టుబాటు ధర పరిస్థితిపై అనుమానాలు

ఏజెన్సీలో గిరిజనులకు ప్రధాన ఆదాయ పంటలు చింత, జీడి. ఈ రెండు పంటలు బాగా పండితే గిరిజన జీవనం సజావుగా సాగుతుంది. లేకుంటే ఇబ్బందులే. ఈ రెండు పంటలు గత మూడేళ్లుగా ఆశాజనకంగా లేవు. దీని ప్రభావం గిరినులపై తీవ్రంగా పడింది. పంట దిగుబడి తగ్గినా పండిన అరకొర పంటకు కూడా గిట్టుబాటు ధర లభించని పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ ఏడాది ఇప్పటికే జీడి పంట పూత ఆశాజనకంగా ఉండడంతో గిరిజనులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. పంట చేతికొచ్చే వరకూ పరిస్థితులు సజావుగా ఉంటే ఈ ఏడాది తాము ఎంతో కొంత ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్న గంపెడాశతో ఉన్నారు. వీరి ఆశను ప్రకృతి ఎలా కరుణిస్తుందో... గిట్టుబాటు ధర కల్పించి పాలకులు ఎలా ఆదుకుంటారో వేచి చూడాల్సిందే.

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో 3,500 ఎకరాల్లో జీడిపంట సాగవుతోంది. ఈ ఏడాది పువ్వు ఆశాజనకంగా ఉండడంతో కొంతమేరకు గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది దిగుబడి పూర్తిగా లేకపోవడంతో జీడిపంట సాగు చేసే రైతులకు నిరాశ మిగిలింది. అప్పులు చేసి మదుపులు పెట్టి జీడి సాగు చేస్తుంటే కనీసం ఆ అప్పులు తీర్చేందుకు పంట చేతికి రాకపోవడంతో గిరిజనులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు ఏళ్ల నుంచి వివిధ తెగుళ్ల బారినపడి పూర్తిగా పంట దిగుబడి రావడం లేదు. దీనికి తోడు మంచు దెబ్బకు పూత పూర్తిగా మాడిపోయి జీడి రైతులను కుదేలుకు దారితీసింది. ఈ పంటే ఆధారమైన అనేక మంది రైతులు వివిధ అవసరాల కోసం కోసం చేసి అప్పులు అలాగే ఉన్నాయి. గతంలో తెగుళ్ల బారిన జీడిపంట పూర్తిగా నష్టపోవడంతో అప్పటిలో ఐటిడిఎ ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ అధికారులు పర్యటన చేసి పంటలను పరిశీలించారు. అనంతరం నష్టపోయిన జీడి రైతులకు ప్రభుత్వం తరపున పరిహారం అందించేందుకు నివేదికలు పంపించినా, నేటికీ ఒక్క రైతుకు కూడా పరిహారం అందే పరిస్థితి లేదు.

ఈ ఏడాది జీడిచెట్లు ఆకు కనిపించకుండా పూసినపూతతో రైతు సంబర పడుతున్నాడు. సాధారణంగా ఎకరా జీడితోటకు 250 కేజీల వరకు దిగుబడి వస్తుంది. అదే అంతరపంటగా జీడి సాగుచేస్తే ఎకరాకు 180 కేజీల వరకు దిగుబడి వస్తుంది. కానీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఎకరాకు 50 కేజీలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉంటుందని ఆశపడుతున్నారు. అంతేకాక జీడికి గతంలో టి దోమ, పిండినల్లి, నల్లి, పూతమాడు తెగులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి నివారణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని రైతులు అవగాహన కల్పించాల్సి ఉంది. దీంతో జీడిపువ్వు మాడిపోవడం, వచ్చిన పిక్క కాండం ఎండిపోవడం, పిక్కపై మచ్చలు ఏర్పడి బంకలా జిగురు వంటి ద్రవం కారడం జరుగుతోందని రైతులు తెలుపుతున్నారు. పువ్వు ఆశాజనకంగా ప్రారంభం కావడంతో రైతుల సంతోషపడుతున్న అదే సమయంలో సంబంధిత అధికారులు తోటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు అవసరమైన మందులు రాయితీపై ఇచ్చి అవగాహన కల్పించాల్సి ఉంది.

జీడి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి

మండలంలో జీడి పంట సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం అన్నివేళలా ఆదుకోవాలి. తెగులు బారిన జీడిపంట పడటంతో గిరిజనులు ఆశలని అడియాసలు అవుతున్నాయి. ప్రభుత్వం తెగులు నివారణకు కృషి చేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

కొల్లి సాంబమూర్తి,
సిపిఎం నాయకులు

పువ్వు రాలకుండా చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం జీడి పువ్వు ఆశాజనకంగా వచ్చినప్పటికీ అది రాలిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. ఇప్పటికే గిరిజనులకు రాయితీపై అవసరమైన మందులు పంపిణీ చేసి పువ్వు నిలబడడానికి చర్యలు చేపట్టాలి.

-బిడ్డిక తమ్మయ్య,
జీడి రైతు, అల్లువాడ

తెగుళ్ల నివారణకు కృషి చేస్తే దిగుబడి

ప్రతి ఏటా జీడి పువ్వు ఆశాజనకంగా వస్తుంది. కానీ తెగులుతో దిగుబడి రావడం లేదు. అధికారులు జీడి సాగుపై గిరిజనులకు అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగులు నివారణకు కృషి చేస్తే ఎంతో లాభదాయకం.

హిమరక రామారావు,
జీడి రైతు, బొడ్డవలస



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహనరావు

సిపిఎస్ రద్దుపై అసెంబ్లీలో తీర్మానించాలి

యుటిఎఫ్ సంకల్ప దీక్ష పిలుపు

ప్రజాశక్తి - కలెక్టరేట్

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని తీసుకురావడానికి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి తీర్మానం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన రావు డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు కోరుతూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆదివారం స్థానిక చర్చి జంక్షన్ వద్ద సంకల్ప దీక్షలు యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ దీక్షలను జెఎసి చైర్మన్ జి.కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం అన్ని సంఘాలతో కలిపి ఐక్య ఉద్యమం చేపడుతామని, సిపిఎస్ రద్దయ్యే వరకూ పోరాటం చేస్తున్న యుటిఎఫ్‌ను ఈ సందర్భంగా అభినందించారు. సిపిఎస్‌కు బదులు జిపిఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీము)ను తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఈ ప్రయత్నాన్ని తిప్పికొడతామని, అవసరమైతే అన్ని సంఘాలతో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని మురళీమోహనరావు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ ఈనెల 5 తేదీ వచ్చినప్పటికీ ఇంత వరకూ జీతాలు పడలేదన్నారు. ఉద్యోగులను, ఉపాధ్యాయులను స్నేహితులుగా చూస్తానని చెప్పిన ముఖ్యమంత్రి వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. సిపిఎస్ విభాగం కన్వీనర్ ఎం.శంకర్రావు మాట్లాడుతూ వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారని విమర్శించారు. భవిష్యత్తులో సిపిఎస్ కుటుంబ సభ్యులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.విజయ్ కుమార్, బి.జ్యోతి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీను, ఎం.పైడిరాజు, గోవిందమ్మ, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మునాయుడు

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, రైతాంగ హక్కుల కోసం ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సంఘాలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం, సిఐటియు ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాసంఘాల నాయకలు వై.మన్మధరావు, కె.గంగునాయుడు, ఆర్.రమణ మూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రజల సంపదనంతా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు దోచిపెడుతుం దని, దేశ ప్రజలపై మరింత పన్నుల భారం, నిత్యవసరం సరుకులు ధరలు పెరుగుదలతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవించలేని పరిస్థితి ఉందని అన్నారు. దేశ నవరత్నాలుగా పేరుగాంచిన ప్రభుత్వ రంగ సంస్థలను, కోట్లాది మంది పైసా పైసా కూడబెట్టుకున్న ఎల్ఐసిని, ప్రభుత్వ బ్యాంకులు, రైల్వే తదితర సంస్థలను బిజెపి బరితెగించి కార్పొరేట్లకు తెగ నమ్ముతుందని విమర్శించారు. కార్మిక హక్కులను కాల రాస్తుందని, నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి ఉద్యోగస్తులకు, కార్మికులకు బతుకులేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని, నల్ల చట్టాలు రద్దు చేయాలని రైతులు వీరోచితంగా పోరాడారని, ఆ పోరాటంలో వందలాది మంది రైతులు ప్రాణాలను బిజెపి ప్రభుత్వం బలితీసుకుందన్నారు. ఉపాధి చట్టానికి తూట్లు పొడిస్తూ కేంద్ర బడ్జెట్‌లో భారీ కోత విధించిందన్నారు. కౌలు రైతుల హక్కులను నిర్వీర్యం చేస్తుందని, బిజెపి ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేసిందని గుర్తు చేశారు. ప్రత్యేక హెూదా, విభజన చట్టం హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కావున సమస్యల పరిష్కారానికి, దేశ రక్షణకు ఏప్రిల్ 5న ఢిల్లీలో జరుగు మహా ప్రదర్శన పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, నాయకులు గొర్లి వెంకటరమణ. కొల్లి సాంబమూర్తి,రాము, అప్పలస్వామి, జ్యోతి, సరళ, శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

'గంటేడ'కు అభినందనల వెల్లువ

పాడుదమా స్వేచ్ఛా గీతానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం




ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

"పాడుదమా స్వేచ్ఛాగీతం...
ఎగరేయుదమా జాతిపతాకం..
దిగంతాల నినదించి..
విశ్వవిఖ్యాతినొందగా జాతిగౌరవం

అన్న దేశభక్తి గీతానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోచోటు లభించడంతో జిల్లా రచయితలు, స్నేహకళాసాహితీ, వివిధ సాహిత్యసంస్థలు, జనవిజ్ఞాన వేదిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ మైదానంలో జరిగిన హేలాపురి బాలోత్సవంలో ఒకేసారి వేయిమందితో ఈ దేశభక్తి గీతాన్ని ఆలపించగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ గా నమోదుచేసి ప్రశంసా పత్రం, మెడల్ సంపాదించుకుంది. ఈ మేరకు రచయిత గంటేడ గౌరునాయుడుకు పలువురు కలసి అభినందనలు తెలిపారు. ఈ దేశభక్తిగీతం నేడు ఉభయ రాష్ట్రాల్లోని అన్ని విద్యాసంస్థల్లో ప్రార్ధనా గీతంగా, దేశభక్తి గీతంగా ఆలపించడం ఎంతో గర్వించదగ్గ విషయంగా చెప్పవచ్చు. ఇదేగీతాన్ని 2022 సంవత్సరంలో మహారాష్ట్ర ప్రభుత్వం 9వతరగతిలో మొదటి పాఠ్యాంశంగా చేర్చింది. ఇటువంటి ఉత్తమ కదా రచయత మన మన్యం జిల్లాకు చెందిన వాడు కావడం ఎంతో గర్వకారణం. ఆయన సాహిత్యంపై ఇప్పటికే తెలుగు విశ్వ విద్యాలయం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళ విశ్వ విద్యాలయంకు చెందిన నలుగురు పరిశోధనలు పూర్తి చేయగా, ద్రవిడ విశ్వ విద్యాలయంనుండి ఒకరు, ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి మరో ఇద్దరు పరిశోధనలు చేస్తున్నారు.

పురష్కాం అందుకున్న సందర్భంగా గౌరునాయుడు మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవానికి హాజరైన బాలబాలికలు గొంతుకలిపి పాడతారని, నిర్వాహకుల్లో ఒకరైన నరసింహారావు నుంచి తనకు పిలుపు రావడం ఎంతో సంతోషించానన్నారు. సిఆర్ రెడ్డి కళాశాల మైదానంలో 'పాడుదమా స్వేచ్ఛాగీతం' పాటను మూడు వేలమంది బృందంగా ఆలపిస్తారని, కొందరుపిల్లలు వేదికపై ఈ పాటకు నృత్యం చేస్తే, మరికొందరు కోలాటం వేస్తారని తప్పనిసరిగా రావాలని నరసింహారావు ఆహ్వానం పంపించారని చెప్పారు. తనకు బుక్ ఆఫ్ రికార్డ్ గూర్చి నిర్వహకులు చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ దేశభక్తి గీతం నాచేత రాయించినది పిల్లలేనని చెప్పారు. 30ఏళ్ల క్రితం గుమ్మలక్ష్మీపురం మండలంలో రేగిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల బాలికలు అలిగి, అడిగి మరీ రాయించుకున్న పాటని తెలిపారు.

కథ, కవిత్వం, పాట, పద్యం అన్ని ప్రక్రియల్నీ సమర్ధవంతంగా నిర్వహించ గలిగిన గంటేడ గౌరు నాయుడు మాస్టారు కొమరాడ మండలం దళాయిపేటలో సోములమ్మ, సత్యంనాయుడు దంపతుల మొదటి సంతానం. గిరిజన సంక్షేమ శాఖలో మూడు దశాబ్దాల పాటు ఉపాధ్యాయుడిగా సేవలు అందించి ప్రస్తుతం సాహిత్య అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. "పాడుదమా స్వేచ్ఛా గీతం" గీత రచయితగా ఖ్యాతిగాంచిన మాస్టారు మంచి గాయకుడే కాకుండా మంచి చిత్రకారుడు కూడా. కురుపాంలో "స్నేహ కళాసాహితి"ని స్థాపించి ఉత్తరాంధ్ర నుంచి ఎందరో కవుల్నీ, కథకుల్నీ తయారు చేసిన ఘనత మాస్టారుదే. గౌరునాయుడు గ్రామీణ, జానపద కథకుడు. మంచిని, మానవత్వాన్ని ప్రేమించినవాడు. తనచుట్టూ ఉండే తనవారి జీవన పోరాటాలను కథలుగా, కవితలుగా రాస్తారు. ప్రపంచీకరణ ప్రభావంతో అన్ని పల్లెల్లాగే ఉత్తరాంధ్ర పల్లె తన సహజత్వాన్నీ కోల్పోయింది. పల్లెల్లోకి పెట్టుబడిదారుడు పాదం మోపాక వ్యవసాయం వ్యాపారంగా మారింది. రైతు తన పొలంలో తానే ఒక కూలీగా మారిపోయాడు. ఈ మార్పుల్నీ ఎప్పటికప్పుడు తన కథల్లో సజీవంగా చిత్రిస్తున్న రచయిత గౌరు నాయుడు. గౌరు నాయుడు ఎన్నో ఏళ్లుగా రాస్తున్న రచనలను కురుపాం స్నేహ కళాసాహితీ ప్రచురణ చేస్తుంది. ఆయనకు ఎన్నో పురస్కారాలు, ఎన్నో అవార్డులు, రివార్డులు రావడం గమనార్హం. హంగులు, ఆర్భాటాలు లేకుండా సాధారణ వ్యక్తిగా ఉండటానికే గౌరునాయుడు ఇష్టపడతారు.



వార్డు వాసులకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

మళ్లీ జగనొస్తే మరిన్ని పథకాలు

గడపగడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ సిఎం అయితే మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. ఆదివారం గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన పట్టణంలోని ఏడో వార్డు పరిధిలో గల గాంధీనగర్, దాసరి వీధుల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గడచిన మూడేళ్లలో రాష్ట్రంలో పేదలకు దళారీల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ది చేకూర్చిన ప్రభుత్వం వైసిపి దేనని చెప్పారు. గ్రామ,వార్డు స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించడానికే సచివాలయం, వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ పై డిప్యూటీ సీఎం ఆగ్రహం

గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గాంధీనగర్‌లో ఇంటింటికీ తిరుగుతున్న క్రమంలో ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు రాజన్నదొరను కలిసి సమస్యలు వివరించారు. తమ అపార్ట్‌మెంట్‌లో ఇళ్ల నుంచి వాడుక నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాజన్నదొర కమిషనర్ శంకరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో గత 15ఏళ్లలో నిర్మాణమైన అపార్ట్‌మెంట్లు, నిబంధనల మేరకు వున్నాయా లేదా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఒకవేళ నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతులు జారీ చేస్తే సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్‌కు సూచించారు.



లోకేష్‌తో పాటు నడుస్తున్న బేబినాయన

లోకేష్ పాదయాత్రలో బేబినాయన

ప్రజాశక్తి - బొబ్బిలి

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో బొబ్బిలి టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ బేబినాయన ఆదివారం పాల్గొన్నారు. కాణిపాకం వద్ద జరిగిన పాదయాత్రలో లోకేష్‌ను బేబినాయన కలిసి పాదయాత్రలో లోకేష్‌తో అడుగులు వేశారు. బొబ్బిలి రాజకీయ పరిస్థితులపై ఇద్దరు చర్చించారు. బొబ్బిలిలో టిడిపి జెండా ఎగర వేస్తామని బేబినాయన లోకేష్‌తో అన్నట్లు టిడిపి కార్యకర్తలు చెపుతున్నారు.

ఏనుగుల సమస్య పరిష్కారానికి పటిష్టమైన చర్యలు



- రూ.3 కోట్ల పంటనష్టం అంచనా
- గిరిజన ప్రాంతాల్లో రోడ్ల పనులకు అనుమతులు
- 'ప్రజాశక్తి'తో జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన ముఖాముఖి

జిల్లాలో అటవీశాఖ ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైంది ఏనుగుల సమస్యల అని, దీని పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా అటవీశాఖాధికారి జిఎపి ప్రసూన అన్నారు. అటు వన్యప్రాణుల సంరక్షణతో పాటు, ఇటు ప్రజల ఆస్తి, ప్రాణాలను కాపాడడం తమకు చాలెంజ్‌గా మారిందని చెప్పారు. అయినా అధికారులు, సిబ్బంది సహకారంతో సమస్యను ధీటుగా ఎదుర్కొని, సమస్య పరిష్కారానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్న చెప్పారు. పార్వతీపురం, కురుపాం నియోజకవర్గ ప్రజలతో పాటు పాలకొండ నియోజక వర్గంలోని భామిని ప్రాంతాల్లో విహరిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలతో పాటు, కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత సంస్థాగతంగా కుదురుకుని, శాఖను అభివృద్ధి పథంలో నడిపించుకోడానికి తీసుకుంటున్న చర్యలను ప్రజాశక్తి 'ముఖాముఖి'కి వివరించారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లో...

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఏనుగుల సమస్యను పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యలేమిటి ?

జిల్లాలో సంచరిస్తున్న వన్యప్రాణులను సంక్షణగానీ, తరలింపునకు గానీ కేంద్రం చేసిన వన్యప్రాణి సంరక్షణ చట్టాలకు లోబడి నిర్ణయాలు తీసుకుంటున్నాం. ఈ సమస్య జిల్లాల విభజన ముందు నుంచి ఏళ్లతరబడి ఆయా ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్నదే. అయినా సమస్య తీవ్రతను కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపుతున్నాం. తరలింపు కష్టసాధ్యమైనప్పుడు, కనీసం వాటి సంరక్షణ కేంద్రాలు మంజూరు చేయాలని కోరాం.

ఏనుగుల సంరక్షణకు మీరు ప్రతిపాదించిన ప్రాంతాలేవి?

పార్వతీపురం మండలంలోని జంతికొండ, చందలంగి, కొమరాడ మండలం అర్తాం రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో కొంత భాగం, గరుగుబిల్లి, కురుపాం, గుమ్మలక్ష్మిపురం మండలాల్లోని, రావాడ డ్యాం, తోటపల్లిడ్యాం, బోడికొండ రిజర్వు ఫారెస్టులతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటుకు రూ.40కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. కేంద్రం అనుమతుల కొరకు ఎదురుచూస్తున్నాం.

జిల్లాలో పులు సంచారం ఉందా?

జిల్లా ప్రస్తుతం పులుల సంచారానికి సంబంధించిన దాఖలా ల్లేవు, ప్రస్తుతం మన జిల్లాకు దూరంగా ఉంటూ ఆడ, మగపులి కలిసి సంతానోత్పత్తి కార్యక్రమంలో ఉన్నట్లు అనధికార సమాచారం ఉంది.

జిల్లాలో అటవీ పరిధి ఏమిటి

జిల్లాలో పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ రేంజ్‌ల పరిధిలో పాలన కొనసాగుతుంది. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో కార్యాలయాలతో పాటు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాం. ఈ నాలుగు రేంజ్‌ల్లో పూర్తి స్థాయి రేంజర్లు ఉన్నప్పటికీ, ఏనుగుల సంరక్షణ, సామాజిక వనాల కోసం ఉన్న రేంజర్లలో కొంతమందికి అదనపు బాధ్యతలు అప్పగించాం. సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవడంతో కొంత వరకూ బాధ్యతల నిర్వహణ కష్టమైనప్పటికీ ఉన్న సిబ్బంది సహకారంతో పరిపాలన సాగుతోంది. జిల్లాలో పూర్తి స్థాయిలో 178 మందికి పైగా అవసరమైనప్పటికీ 98మంది వరకు సిబ్బంది కేటాయింపు జరిగింది.


జిల్లాలో పచ్చదనం, వనాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?

నర్సరీల పెంపకం ఒకప్పుడు అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగినప్పటికీ, ప్రస్తుతం ఉపాధి హామీ పనులతో చేపడుతుండడంతో ఉపాధితో పాటు, అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీల ఏర్పాటుతో పాటు, మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుంది.

ఏనుగుల దాడిలో ప్రాణ, ఆస్తి నష్టపరిహారం చెల్లింపులు ఎంత?

జిల్లా ఏనుగు దాడిలో ఇంత వరకూ 370 ఎకరాల్లో పంట నష్ట సంభవించింది. పంట నష్టాన్ని దాదాపుగా రూ.3కోట్లుగా అంచనాలు వేస్తున్నాం. 10 మంది వరకూ మనుషులతో పాటు పశువులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. రూ.38లక్షలు పరిహారం చెల్లించాల్సి ఉండగా రూ.20లక్షల వరకూ చెల్లింపులు జరిగాయి. మిగతా పరిహారం కోసం బిల్లు ప్రభుత్వానికి పంపించాం.

అటవీ ప్రాంతంలో రోడ్లు పనులకు అనుమతులపై అభ్యంతరాలేమిటి?



గిరిజన ప్రాంతాల్లో రహదారులకు తామేమి అభ్యంతరం తెలపడం లేదు. అయితే ప్రతి శాఖకు స్పష్టమైన విధి విధానాలు ఉంటాయి కనుక ఆర్‌అండ్‌బితో పాటు సంబంధిత శాఖలు ప్రతిపాదనలు, నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో జాప్యం జరుగుతుంది. కనుక అధికారులు పనులు ప్రారంభానికి ముందే అనుమతులు పొందాల్సి ఉంది. పనులు ప్రారంభించిన తర్వాత అనుమతులు కోరడంతో జాప్యం జరుగుతుంది. అయినప్పటికీ సాధ్యమైన మేరకు అనుమతులు మంజూరు చేస్తున్నాం.

కలప అక్రమ రవాణాపై తీసుకుంటున్న చర్యలు?

అనుమతుల్లేకుండా కలప అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని నాలుగు రేంజ్‌ల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం వల్ల అక్రమంగా రవాణా అదుపు చేయగలిగాం. లక్ష్యాల మేరకు అపరాధ రుసుం వసూలు చేయడం జరుగుతుంది.

ప్రజాశక్తి
www.prajasakti.com


సవరకోట పాడు పార్కు ప్రతిపాదనలను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్ (ఫైల్)

పర్యాటక అభివృద్ధికి చర్యలు

గుమ్మలక్ష్మీపురం : గత కొన్నేళ్ల నుంచి ప్రతిపాదనలకే పరిమితమవుతున్న సవర కోటపాడు ఉద్యానవన ఫల నర్సరీ శిక్షణ కేంద్రం అభివృద్ధికి పార్వతీపురం ఐటిడిఎ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ శిక్షణా కేంద్రంలో పర్యాటకుల సౌకర్యార్థం దుకాణ సముదాయాలు, బోట్లు, సైక్లింగ్, నడక వంతెన, అమృత సరోవరం చెరువులు తదితర పనుల నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇందుకోసం రూ.2 కోట్లుతో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రంలో పనులు పూర్తయితే ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి ఎస్ కె పాడు నర్సరీ అభివృద్ధికి ఐటిడిఎ, ఉద్యానవన శాఖ అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు తయారు చేసి పనులు ప్రారంభించినా అవి మధ్యలోనే నిలిచిపోయాయి. ఐటిడిఎ పిఒలు బదిలీపై వెళ్లడం, తర్వాత వచ్చిన పిఒలు వచ్చి పరిశీలించి మళ్లీ మొదటి నుంచి ప్రతిపాదనలు తయారు చేయడం పరిపాటిగా మారింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత పిఒ విష్ణుచరణ్‌నైనా ఎస్.కెపాడు నర్సరీకి పూర్వ వైభవం తీసుకొచ్చి ప్రభుత్వానికి ఆదాయంతో పాటు ఉపాధి కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


జగదీశ్వరికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కానసింగిలో కంది పండుగ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన చాపరాయి బిన్నిడి పంచాయితీ కానసింగిలో శనివారం రాత్రి కంది పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరికి గిరిజనులు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. గిరిజనులు గ్రామ దేవతకు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. జగదీశ్వరి గిరిజనులతో కలిసి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

పార్వతీపురం టౌన్ : ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం విఫలమైందని జనసేన నాయకులు ఆరోపించారు. ఆదివారం జనసేన నాయకులు విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా జిల్లాలో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటనలు గుప్పించిన పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలో ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేదన్నారు. సంక్రాంతి తర్వాత ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో జిల్లాలోని రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉన్నాయన్నారు. పండించిన పంటను అమ్ముకోలేక పొలాల్లో, కల్లాల్లో ధాన్యపు బస్తాలు నిట్టలు వేసి రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. ఓవైపు అగ్ని భయం, మరోవైపు దొంగలు, ఏనుగులు భయంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోలేని దుస్థితిలో రైతు ఉండడం బాధాకరమన్నారు. అన్నం పెట్టే రైతన్న మానసిక క్షోభ రాష్ట్రానికి మంచిది కాదన్నారు. రైతు పండించిన పంటను కొనకపోతే, రైతు పంటకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. అప్పుడు తిండికి దొరకని దుస్థితి ఎదురవుతుందన్నారు. జిల్లాలో దాదాపు లక్షకు పైగా టన్నుల వరకు రైతుల వద్ద ధాన్యపు నిల్వలు ఉన్నాయన్నారు. ఇప్పటికే మిల్లర్లు, వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులు ఒక్కటై రైతుల నుంచి ఎక్కువ ధాన్యం తూకం వేయటం జరిగిందన్నారు. దళారులు కూడా రంగ ప్రవేశం చేశారన్నారు. తక్షణమే వాటిని కొనుగోలు చేయాలన్నారు. లేనిచో ఆందోళన చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు గొర్లి చంటి, దాలినాయుడు, రాంబాబు, శరత్ కుమార్, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

అడ్డంకులు సృష్టిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

పార్వతీపురం రూరల్ : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర దిగ్విజయంగా 100 కిలోమీటర్లు పూర్తి చేసుకోవడం ప్రజల్లో ఆ యాత్రకు విశేష ఆదరణ కనిపించడంతో వైసిపి నాయకులు వణికిపోతున్నారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ఆదివారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లాలోని పోలీసు యంత్రాంగం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ పాలకులకు తొత్తులుగా వ్యవహరిస్తూ అడుగడుగునా పాదయాత్రకు అడ్డంకులు కల్పిస్తున్నారన్నారు. అయినా మహిళలు, యువత పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపిస్తున్నారని అన్నారు. పలమనేరు డిఎస్‌పి, ఎస్సై వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. వారి ప్రవర్తన అలాగే కొనసాగితే ప్రజలే తిరగబడి బుద్ధి చెబుతారని అన్నారు.

పార్కులో సండే సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సందడి గురించి చెప్పవసరం లేదు. ప్రతి ఒక్కరు సెలవు దినం సందర్శిస్తారు. ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సందడిగా మారడం ఒక ఆనవాయితీగా మారింది. సెలవు దినం కావడంతో పర్యాటకులు పిల్లలతో పార్కును సందర్శించి పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదిస్తారు. పార్కును సందర్శించి చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రాంతాలు పర్యటించి కాసేపు కుటుంబాలతో సేద తీర్చుకుంటారు. అయితే పార్కులో ఉన్న బోటు షికారు, ఆల్టైన్ వెహికల్‌లో పెద్దలు షికార్లు చేస్తే, చిన్నారులు కమాండోనేట్, స్విమ్మింగ్ రోలర్‌లో సందడి చేస్తున్నారు. ఇక యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్తే మరికొంత మంది స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో తొక్కుకుంటూ ముందుకు సాగుతారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

రోడ్డు నియమాలను పాటించాలి: ఎస్‌ఐ

సీతానగరం: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నియమాలను పాటించి వాహనాలను నడపాలని ఇన్‌ఛార్జి ఎస్‌ఐ ఎన్. పవన్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక హనుమాన్ కూడలి వద్ద వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా ద్విచక్ర వాహనాన్ని నడిపేవారు హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తదితర దవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆటోనడిపే వారు సరిపడా ప్రయాణికులతో ప్రయాణించాలన్నారు. అపరాధరుసుం బకాయిలు చెల్లించాలని కోరారు. మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. మైనర్లు వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీతానగరం వంతెనపై ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించామని చెప్పారు. రాత్రి పూట గస్తీ కూడా ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఆయనతో పాటు ఎఎస్‌ఐ లంక శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ వాసుదేవరావు, కానిస్టేబుళ్లు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలో ఎస్సై ఏ నీలకంఠరావు వాహనాలు తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనంపై మితిమీరిన వేగం వెళ్లరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లరాదన్నారు. ఓవర్ లోడ్ వేయరాదన్నారు వాహనం చోదకులకు లైసెన్స్ సి బుక్ ఇన్సూరెన్స్ హెల్మెంట్ తప్పనిసరిగా ఉండాలన్నారు



సీతానగరంలో ఆటోను తనిఖీ చేస్తున్న ఎస్ఐ పవన్‌కుమార్

వైసిపి ఏజెంట్‌లా ఎపిసి

- సమావేశం పేరిట కెజిబివి ఎస్‌ఒలు, టీచర్లు, సిబ్బందికి పిలుపు
- తీరా అందరూ వచ్చాక ముఖం చాటేసిన వైనం
- అనూహ్యంగా వేదికపై ప్రత్యక్షమైన వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి
- తనను గెలిపించాలంటూ వేడుకోలు
- తిట్టుకుంటూ వెనుదిరిగిన కెజిబివి సిబ్బంది
- భోజనం చేసేందుకూ నిరాకరణ
- జిల్లా పరిషత్తు వేదికగా హైడ్రామా


సమగ్ర శిక్ష ఎపిసి వి.అప్పలస్వామినాయుడు వైసిపి ఏజెంట్ మాదిరిగా వ్యవహరించారు. బాధ్యత కలిగిన హోదాలో ఉన్న ఉన్నతాధికారి అక్షరాలా అధికార పార్టీ కార్యకర్తలాగే పనిచేశారు. ప్రభుత్వ సెలవుదినం రోజున అధికారిక సమావేశం ఉందంటూ కెజిబివి ఎస్‌ఒలు, టీచర్లు, సిబ్బందిని పిలిచారు. ఆ సమావేశంలో అనూహ్యంగా వైసిపి బలపర్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రత్యక్షమయ్యారు. తను గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరించేస్తానంటూ ప్రగల్బాలు పలకడంతో అక్కడ ఆశీనులైన ఉద్యోగులంతా అవాక్కయ్యారు. తీరా! ఎపిసి ఎక్కడయ్యా? అంటే ఆ దరిదాపుల్లో కనిపించలేదు. అదే సముదాయంలోని మరో భవనంలోని ఒకగదిలో ఆయన దాక్కుండిపోయినట్టు తెలియడంతో అక్కడికి చేరిన వందలాది మంది టీచర్లు, సిబ్బందికి హైడ్రామా మొత్తం అర్థమైంది. దీంతో, అక్కడి నుంచి అంతా ఒక్కసారిగా బయటకు వచ్చేశారు. ఇదా ఈయన గారి బండారం! అంటూ ఎపిసి స్వామినాయుడు వ్యవహారశైలిపై చర్చలే చర్చలు నడిశాయి. ఎపిసికి శాపనార్థాలు పెట్టుకుంటూ వెనుదిరిగారు.


జెడ్‌పి సమావేశ మందిరం ఎదుట ఎపిసికి వ్యతిరేకంగా చర్చించుకుంటున్న కెజిబివి టీచర్లు, సిబ్బంది

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సమయం ఆదివారం ఉదయం 10.30 గంటలు కావస్తోంది. జిల్లా నలుమూల నుంచి కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, అందులో పనిచేస్తున్న సిఆర్‌టి, పిజిటిలతోపాటు బోధనేతర సిబ్బంది గుంపులుగుంపులుగా వస్తున్నారు. అందరి దారీ జిల్లా పరిషత్తు వైపే. చర్చంతా సమావేశంపైనే. ఇంతకీ ఏమిటా సమావేశం?.. మునుపెన్నడూ లేనిది టీచర్లందర్నీ ఒకేసారి ఎందుకు పిలిచారు?.. కార్యాలయ సిబ్బందిని కూడా విడిచిపెట్టలేదు! అందులోనూ ఆదివారం, ఇంత అర్జెంటు ఏమై ఉంటుందో?.. ఇంత ప్రాధాన్యత దేనికై ఉంటుందో?.. ఇలా ఎన్నో ప్రశ్నలు, మరెన్నో సందేహాల నడుమ తీవ్ర ఉత్కంఠతో వందలాది మంది జిల్లా పరిషత్తు ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికే ఎపిసి పురమాయించిన కొంతమంది వ్యక్తులు కెజిబివిల నుంచి వచ్చిన వారందరికీ జెడ్‌పి సమావేశ మందిరంలోకి సాదర స్వాగతం పలుకుతున్నారు. లోపలికి వెళ్లాక టీ, స్నాక్స్ వంటి వాటితో సకల మర్యాదలకు సిద్ధమౌతున్నారు. అప్పటికే కొంతమంది టీచర్లకు అనుమానం వచ్చింది. ఎప్పుడు తిట్లపురాణం, చీదరింపులు, హెచ్చరికలతో మొదలయ్యే సమావేశం ఈసారి 'అయ్యగారు' రాకముందే ఇన్ని మర్యాదలేంటబ్బా? అని!. స్వామినాయుడు ఎంతకీ కాకపోవడంతో అనుమానాలు పెనుభూతాలుగా మారుతున్నాయి. సరిగ్గా అదే సమయంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు వైసిపి బలపర్చిన అభ్యర్థి సుధాకర్ ఎంట్రీ ఇచ్చారు. దీంతో, చాలా మంది అవాక్కయ్యారు. మరికొంతమంది ఊహించినట్టే జరిగిందంటూ అసలు విషయం అర్థం చేసుకున్నారు. ఇంతకీ అయ్యగారి ఆచూకీ ఎక్కడ? ఎటు చూసినా ఎపిసి కనిపించలేదు. అంతలోనే అభ్యర్థి తన పరిచయ ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎప్పుడూ ఆయన ముఖం చూడలేదే! అంటూ కొందరు? ఓహో ఇందుకేనా ఇంత డ్రామా? అంటూ మరికొందరి గుసగుసలు. అంతలోనే తేరుకున్న ఆ అభ్యర్థి తనను గెలిపిస్తే ప్రభుత్వంతో పోరాడి కెజిబివి టీచర్లు, సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తానంటూ హామీలు గుప్పించారు. దీంతో, ఇప్పటివరకు 'మా కోసం గానీ, ప్రభుత్వ ఉద్యోగుల కోసం గానీ చేసిందేమైనా? ఉందా? ఇంతవరకు సార్ వారు ఎన్ని పోరాటాలు చేశారో? ప్రభుత్వం మీద' అంటూ ఒకరికొకరు చలోక్తులు. అప్పటికీ అభ్యర్థి వేడుకోలు విరమించుకోకపోవడంతో మీటింగ్ హాల్ నుంచి ఒక్కొక్కరుగా బయటకు వచ్చేశారు. దీంతో, మమ.. అంటూ మంగళం పాడడం ఆయనగారి వంతైంది. బయటకు వచ్చాక భోజనాలు ఏర్పాటు చేశామంటూ నిర్వాహకులు పిలిచినప్పటికీ కెజిబివి సిబ్బంది నిరాకరించారు. 'చాలు చాల్లేండి... మీ భోజనాలు, మీరూను! మీటింగ్ అంటే అర్థం పర్థం ఉండాలి!' అంటూ కసురుకున్నారు. ఆదివారం కూడా చావగొట్టారు. రాకపోతే ఛార్జిమెమోలు ఇస్తారో, లేక సస్పెండ్ చేస్తారో? అనే మాట ఎక్కువ మంది నోట వినిపించింది. రాత్రి డ్యూటీ చేసుకుని తెల్లవారి ఉరుకులు పరుగులతో వచ్చామంటూ ఇంకొందరు.. ఇలా వారి ఇబ్బందులంతా ఒకరికొకరు పంచుకున్నారు. అనంతరం అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఈ సంగతి కాస్త అటుంచితే వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారానికి సమగ్ర శిక్ష ఎపిసి అప్పలస్వామినాయుడు తన అధికారాన్ని దుర్వినియోగం చేయడంపై కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. సిఐటియు నాయకులు ఎపిసిని సస్పెండ్ చేయాలని కూడా ప్రకటన విడుదల చేశారు. వైసిపి గెలుపుపై నమ్మకం లేక ఇలాంటి అధికారులను ఉపయోగించుకుని ఇలాంటి దొడ్డిదారి మీటింగులు ఏర్పాటు చేస్తోందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.


All The Principals

Meeting will be conducted for KGBV, SOs , CRTs and PGTs who are in Contact and Outsourcing on Sunday at 10.00 am at ZP Meeting Hall.

Meeting 11 to 12 followed by Lunch.... Principals are ensure to attend 100% staff from your Institution CRT and PGT , PET, CI , VI and Accountants of Contract and Out Sourcing Only.

Sunday Duty Teacher No Need to Attend

As per APC sir instructions who have tomorrow grand test that teacher attending to holiday duty.

All the Principals make sure that all of your staff attended at the venue by 10.45am ....Meeting will be sharply closed by 12.00pm....Remind your staff regarding

Who have attended duty remaining staff attended meeting compulsory they will be answer to APC sir

మోటివేషన్, రీ ఓరియంటేషన్ పేరుతో పంపించిన వాట్సాప్ మెసేజ్‌లు

మోటివేషన్, రీ ఓరియంటేషన్ పేరిట ఆహ్వానం

మోటివేషన్, రీ-ఓరియంటేషన్‌పై ఆదివారం ఏర్పాటు చేయబోయే సమావేశానికి కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, అందులో పనిచేస్తున్న సిఆర్‌టి, పిజిటిలతోపాటు బోధనేతర సిబ్బంది కూడా హాజరు కావాలంటూ సమగ్ర శిక్ష ఎపిసి వాట్సాప్ మెసెజ్‌లు పంపారు. గంటలో సమావేశం ముగిస్తామని, మధ్యాహ్నం భోజనాలు కూడా ఉంటాయని అందులో పేర్కొన్నారు. అందరూ హాజరయ్యే విధంగా స్పెషల్ ఆఫీసర్లు బాధ్యత తీసుకోవాలని కూడా సూచించారు.

ఎపిసిని సస్పెండ్ చేయాలి

రాజకీయ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి సమావేశం ఏర్పాటుచేసిన సమగ్ర శిక్ష ఎపిసి వి.అప్పలస్వామినాయుడును ఉన్నతాధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఉద్యోగుల మనోభావాలను కూడా దెబ్బతీశారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో ఆదివారం సమావేశం పెట్టడమే సరికాదని, అందులోనూ ఒక పార్టీ రాజకీయ లబ్దికోసం పెట్టడం ఎంతో నేరమని పేర్కొన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కలెక్టర్, సమగ్ర శిక్ష ఎస్‌పిడి, విద్యాశాఖ కమిషనర్ వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

ప్రజాశక్తి - పాచిపెంట

కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి బడ్జెట్లో ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా కేటాయించలేదని, వెనుకబడ్డ జిల్లాల ప్యాకేజీల ప్రస్తావనేలేదని, రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్ల పూర్తయినా రాష్ట్రానికి ఇచ్చిన హామీలపై ఏ ఒక్కటీ ప్రస్తావనలేదని అన్నారు. బడ్జెట్లో రాష్ట్రానికి ఇంత వివక్షత, ద్రోహం జరిగినా ముఖ్యమంత్రి కనీసం నోరు విప్పలేదన్నారు. విభజన హామీ అమలు అంశం లేదని, ఒక కొత్త ప్రాజెక్టు కూడా లేదని, దీనివల్ల నిరుద్యోగం పెరిగే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజలు వలసలు పోవడం తప్ప ఉపాధి మార్గాలు చూపడం లేదన్నారు. ఉత్తరాంధ్రలో ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని అమ్మేసేలా కేంద్రం పావులు కదుపుతుందని, ఇది చాలా దుర్మార్గమని, ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వం మొండిగా ముందుకు నడుస్తుందని విమర్శించారు. ఇటువంటి బిజెపిని వైసిపి, టిడిపి, జనసేన ఒక్క మాట కూడా అనడంలేదని, జాతీయ ఉద్యమ స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను, సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అంబానీ, ఆదానీలకు అప్పజెప్పే పనుల్లో మోడీ, అమిత్‌షా బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరిచి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలవాలని, లేకుంటే భవిష్యత్తు పరిణామాలకు బాధ్యత వహించాలని అన్నారు. విభజన హామీల అమలు కాకుండా నీరు గారి పోతున్నయని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో పడిందని, రానున్న కాలంలో ప్రజలంతా పార్టీలకతీతంగా పోరాటాలకు కదిలి రావాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుర్రు రామారావు పాల్గొన్నారు

గిరిజనుడిని అకారణంగా కొట్టడం అన్యాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అమాయక గిరిజనుడిపై పోలీసులు విచక్షణారహితంగా కొట్టడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన దుడ్డుఖల్లు వెళ్లి కామరాజును పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, దుడ్డుకల్లుకు చెందిన కొండగొర్రె కామరాజునితప్పు చేశాడన్న ఆరోపణతో పోలీసులు విచక్షణారహితంగా కొట్టడం భావ్యం కాదని అన్నారు. కామరాజును కొట్టిన పోలీసులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అరసాడలో నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో కొత్తగా నిర్మించిన సచివాలయం, రూ.21.80 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చే లక్ష్యంతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు సచివాలయం వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. వాలంటీరు వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి ప్రభుత్వంతో అనుసంధానం చేసి సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన భవనాలను ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను తీసుకొస్తున్నామని తెలిపారు. అనంతరం జగనన్న కాలనీలో కొత్తగా నిర్మించిన ఇళ్లలో గృహప్రవేశం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపిలు వెలిది సాయిరాం, బేవర హేమలత, సర్పంచ్ పోల సుజాత రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు సభ్యులు గుల్ల ప్రభావతి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు, నాయకులు కార్యకర్తలు, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మే 7, 8, 9 తేదీల్లో గ్రామదేవత ఉత్సవాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో మే 7, 8, 9 తేదీల్లో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌విఎల్‌ఎన్ శర్మ యాజి ఆదివారం ప్రకటించారు. ఏప్రిల్ 16న చాటింపు చేయాలని, 30న వనము గుడి నుంచి బోయవాడి ఇంటి వరకు అమ్మవారిని తీసుకురావాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు డి.శంకర్ జయదేవ్, జామి లక్ష్మీనారాయణ, కె.ఆంజనేయులు, బి.మాణిక్య చంద్రశేఖర్, శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పి.దుర్గారావు, బి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలని మండలంలోని గడగమ్మకు చెందిన పలువురు అధికారులు కోరుతున్నారు. గ్రామంలో బోరుబావులు ఉన్నప్పటికీ తాగేందుకు పనికి రావటం లేదని, బోరు ద్వారా వచ్చే నీరు ఇతరాతర అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గొంతు తడుపుకునేందుకు గ్రామానికి సమీపంలో ఉన్న నాగవల్లి నది వద్దకు వెళ్లి చలమల ద్వారా నీరు తోడుకుని తీసుకొచ్చి దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామంలో జరిగిన వివిధ రకాల సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాము నీటి కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని గడగమ్మ వాసులు కోరుతున్నారు.

ఆప్తులకు అండగా కృష్ణమూర్తి

నిరుపేదల హృదయాల్లో ఆయనకు సుస్థిరం స్థానం
విధి నిర్వహణలో ఆదర్శం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎవరైనా కష్టాల్లో ఉంటే ఆదుకొనేందుకు ముందుంటారు స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వృద్ధ మిత్ర కోఆర్డినేటర్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి. పోలీస్ అంటేనే కర్కశత్వానికి, క్రూరత్వానికి మారుపేరుగా నాటుకుపోయిన ఈ సమాజంలో ఆ వ్యవస్థను చులకనగా చూసేవారు సైతం ఈయన సేవా స్ఫూర్తిని, సేవా గుణాన్ని చూసి అభినందనలు తెలియజేస్తూ, ప్రశంసించడం విశేషం అనేది అక్షరసత్యం.

జిల్లాలోని వీరఘట్ట మండలం కొట్టుగుమ్మడలో మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో అప్పలసూరి, పార్వతమ్మ దంపతులకు జన్మించిన కృష్ణమూర్తి చదువు అనంతరం 1993లో కానిస్టేబుల్ గా విధుల్లోకి చేరారు. అప్పటి నుండి విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు ఎదుటివారిని గౌరవించడం, సేవాభావం పాటిస్తూ తోటి సిబ్బందికి ఆదర్శప్రాయంగా నిలిచారు.

తండ్రే ఆదర్శం...

ఆయన చిన్నప్పుడే తన తండ్రిని ఆదర్శంగా తీసుకున్నారు. తండ్రి అప్పలసూరి వ్యవసాయం చేస్తూ ఎవరికైనా సాయం అందించడంలో ముందుండేవారని, ఎవరైనా ఆడపిల్లకు వివాహం చేయదలిస్తే తనకున్న దాంట్లో సాయమందించే వారిని, తన తండ్రి నుండే తనకు ఆ సేవాగుణం అలవాటైందని చెబుతారు. దీంతోపాటు తాను చదువుకునే రోజుల్లో అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రలను చదివి, వారి సూక్తులను ఆదర్శంగా తీసుకొని సేవా భావం అలవర్చుకున్నానని కృష్ణమూర్తి మాటల్లోనే చెప్పారు.

ప్రతి నెలా కష్టంలో ఉన్న వారికి అపన్న హస్తం

ప్రతినెలా తన జీతంలో కొంత మొత్తాన్ని సమాజ సేవ కోసం వినియోగించడంలో ఆయనకు ఆయనే సాటిని చెప్పవచ్చు. ప్రస్తుత సమాజంలో కని, పెంచిన తల్లిదండ్రులను చాలామంది పిల్లలు రోడ్డున పడేసే సందర్భాలు కోకొల్లలు. వీరితో పాటు వికలాంగులు, దిక్కులేని చిన్నారులు, వృద్ధుల బాధలను, నిస్సహాయతను చూసి అలాంటి వారికి తనకు తోచిన దాంట్లో సహాయం చేయాలని ఆలోచనతో 2017 నుంచి వృద్ధమిత్ర కోఆర్డినేటర్‌గా అప్పటి ఎస్పీ పాలరాజు నియమించారు. అప్పటి నుంచి ప్రతినెలా తన జీతంలో కొంత మొత్తాన్ని వెచ్చించి నిరుపేదలకు, వృద్ధులకు, వికలాంగులకు దుస్తులు, దుప్పట్లు, ఆహారం, నిత్యావసర సరుకులు అందిస్తూనే, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు ఇటీవల పార్వతీపురంలో ఉన్న విజిటేబుల్ మార్కెట్‌లో ప్లాస్టిక్ సంచులు వద్దు గుడ్డ సంచులే ముద్దు అనే నినాదంతో గుడ్డ సంచులను పంపిణీ చేసి పట్టణంలో అందరి మన్నంలో పొందుతున్నారు.

సేవలకు ప్రముఖులు సత్కారం

కృష్ణమూర్తి సేవలకు మెచ్చి ఇంతవరకు 30 సత్కారాలు జరిగి, ఏడు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అప్పటి పార్వతీపురం ఆర్‌డిఒ సుదర్శన్‌దొర, సిఐ సంజీవరావు, వయో వృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధి జె. సీతారాం కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. 2010లో అప్పటి ఎస్పీ నవీన్ గులాట్ ప్రత్యేక బహుమతిని అందజేశారు. 2013లో గణతంత్ర దినోత్సవ సందర్భంగా అప్పటి కలెక్టర్ ఎం వీరబ్రహ్మయ్య చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. 2016 స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అప్పటి మంత్రి కె.మృణాళిని చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. 2018 గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అప్పటి ఎస్పీ పాలరాజు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. 2021లో విశాఖ రేంజ్ డిఐజి ఎల్‌కెవి రంగారావు చేతుల మీదుగా విశాఖపట్నంలో సన్మానం, గత ఏడాది డిసెంబరు 5న "ఇంటర్నేషనల్ వాలంటరీ డే" సందర్భంగా పార్వతిపురం రెడ్ క్రాస్ సొసైటీ, ఐఆర్‌పిడబ్ల్యుఎ ఆధ్వర్యంలో జిల్లా మేజిస్ట్రేట్ దామోదరరావు, సివిల్ జడ్జి రమేష్, జయబాబు, మంచుపల్లి శ్రీరాములు మాస్టారు, తదితరులు సన్మానించారు.


వృద్ధురాలికి బట్టలు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి


హెచ్‌సి కృష్ణమూర్తికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న విశాఖ రేంజ్ డిఐజి రంగారావు

మానవత్వం చాటుకున్న హెచ్‌సి

కొమరాడ : హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని మార్కొండపుట్టిలో ఆదివారం వృద్ధ మహిళలకు దుప్పట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న వృద్ధమిత్ర కృష్ణమూర్తి ప్రజాసేవకే అంకితమయ్యారు. కష్టంలో ఉన్న వృద్ధులకు ఎప్పుడు తను సహాయం చేస్తానని తెలిపారు. తనకొచ్చే జీవితంలో ప్రతి నెలా పేదల అవసరాల కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. పార్వతీపురం పరిసర ప్రాంతాలు, పట్టణంలో పలువురు కృష్ణమూర్తి సేవలను అభినందిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు రవీంద్ర, బోనెల ఆనందరావు బోనేల పోలయ్య, డొంకాడ ప్రంజీత్, శ్రీను, బీసింగ్ వార్డు సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.